

## ఆపరేషన్

అపాయము, ఇతర జబ్బుల, తర్వాత మీ కేశములు తప్పక రాలిపోవును. తటాలున సంభవించిన అదురుభయము, నీరసింపజేయు దీర్ఘవ్యాధులు ప్రసవముకూడ తమవంతు కేశనష్టమును కలిగించియే తీరును. ఒక్కొక్కపుడు కేశముల పొడవు తగ్గిపోవుట పట్టైపడుట కూడ తటస్థించును.

ఇప్పుడు మీరు కేశవర్ధినితో కేశములు రాలుట ఆపుకొనగల్గినప్పుడు మీ తల చర్మము కేశహీనమై విరూపముగా ఎందుకుంచెదరు? జుట్టు రాలిపోవుట హానికరమైనది. మీ జబ్బురోజులలో కురులను కాపాడుకొనుటకు కేశవర్ధిని యుండగా మీరు పోగొట్టుకొననవసరములేదు. అమితముగా వెంట్రుకలు రాలినచోటగూడ కేశవర్ధిని నష్టమును తగ్గించును.

# కేశవర్ధిని

కురులనందముగాపెంచి బలపర్చును.
నేడే మీకురులకు కేశవర్ధిని వాడుడు

| | | |
|---|---|---|
| కేశవర్ధిని | అణాలు | 12/- |
| కేశవర్ధిని షాంపూ | ,, | 12/- |
| కేశవర్ధిని క్రీమ్ | రూ. | 1/- |

ప్యాకింగు, పోస్టేజి అధికము.
వర్తకు లందరివద్ద దొరకును లేక

**సౌత్ యిండియా కెమికల్సు,**
మైలాపూరు, — — మదరాసు.


# ఎదురు నడకలు

[ కథానిక ]

శ్రీ రా. సి. ఆంజనేయశాస్త్రి

౧

"మళ్లా ఎందు కొచ్చాడే అతను?" అంది మా అమ్మ, కొంచెం భయపడుతూనే. నేను జవాబు చెప్పకపోవటంచేత కాస్త ధైర్యం తెచ్చుకుని, "ఒకటికి రెండుసార్లు చెప్పినతరవాతైనా తెలుసుకోవాలి! ఈడొచ్చిన పిల్లవి!!" అంది మళ్లా. చదువుతున్న పుస్తకంలో ౩౮-వ పేజీ గుర్తుపెట్టి పుస్తకం మూసేసి అలాగే కూర్చున్నా. జవాబుమటుకు చెప్పలేదు. కంఠస్వరం హెచ్చించి, "ఇంకోమాటిలాజరిగిందంటే బాగుండదమ్మాయి! తెలిసిందా?" అంది మళ్లీని. కిటికీలోంచి శూన్యంలోకి చూస్తున్నదాన్నల్లా మౌనంగానే మాఅమ్మవేపు తిరిగి, ఆవిడమొహంలోకి చూశా. ఆవిడ గిరుక్కున పక్కకి తిరిగి, చరచరా సావిట్లో కెళ్లిపోతూ, "స్నేహితుడవటంచేత మొహాన చెప్పలేక తటపటాయిస్తున్నాడు. మనస్సు కనిపెట్టి పోవటం మంచిదని చెపుతున్నా." అంది సన్నగా. తనమాట నాకు వినిపించదనుకున్నంతదూరం వెళ్లి... "అలా ఉరిమిఉరిమిచూస్తుం దేమిటే? నన్ను...నాకేం భయ మనుకుందికామాలు!!" అనుకుంది లోలోపల. ఆమాటలు వినేసరికి నాకు కోపం, జాలి, ప్రేమ కలగాపులగంగా కలిసిపోయి "అమ్మా!" అని నానోట పిలిపించాయి. సమాధానం రాకపోతే, వినిపించలేదేమోనని నేనే సావిట్లో కెళ్లేసరికి యిందాకటికంటె కూడా ఎక్కువగా భయపడుతూ "అబ్బే! ఏదో మాటవరసకి అన్నా. తప్పితే, చిన్నప్పటినుంచీ ముగ్గురూ ఎంతో చనువుగా వుంటున్నవాళ్లు ..." అని గుటకలు మింగింది. ఆమెఅవస్థ నేను అర్థం చేసుకున్నా.

పిల్లలు పుట్టనూ, పోనూ — ఆఖరికి నేనొక్కర్తెనీ బతకటం, నేనుపుట్టిన రెండేళ్లకే మానాన్న పోవటంచేత అమితమైన గారాబంగా పెంచింది మా

అమ్మ నన్ను. పెద్దదాన్నవుతున్నకొద్దీ యీగారాబం మకురుతనంగా పరిణమించింది. పెద్దచదువు చదివి బడి మానేసింతర్వాత నామీద ఆవిడకి గౌరవాదరాలు కూడా ఏర్పడ్డాయి. నేను చిన్నబుచ్చుకుంటానని నా కష్టంచెప్పేది కాదు మొదట్లో. రానురాను నా కెదురు చెప్పటానికి భయపడేది. నిజాని కటువంటి స్థితిలో వుండటానికి నాకు యిష్టం వుండటంకాని, నేను ఆపదవిని పొందటానికి ప్రయత్నంచెయ్యటంగాని జరగకపోయినా అప్రయత్నంగానే నేను మాయింటి కధికారిణి నైపోయా. ఇంట్లో కూరలు పురమాయించటం దగ్గిర్నుంచీ మాఅమ్మ ప్రయాణాలవరకూ నా కెదురంటూ లేదు. కాని అతనివిషయంలో మాఅమ్మ యీవిధంగా కేవల విరుద్ధభావం వెల్లడించటం నాకు కొంచెం వింతగానే కనపడ్డది. పెళ్లి అయినతర్వాత యిప్పుడు యింతస్పష్టంగా చెప్పింది. కాని మూడేళ్ల కిందటే కొంచెం బెరుకుబెరుకుగా చూడటం మొదలెట్టింది – నేనూ, అతనూ కబుర్లుచెప్పుకుని నవ్వుకుంటూ ఆడుకుంటుంటే. ఇప్పటికీ నాకు బాగా గుర్తే! కారమ్సు ఆడుతూ నేను గెలుస్తానంటే నేను గెలుస్తానని పందెంవేసుకున్నాం. చూసుకోమరి నేను గెలవకపోతే అని ఒచ్చీరానిమీసం మెలివెయ్యటం మొదలెట్టాడతను. టక్కున బిళ్లలన్నీ కొట్టేసి "అరెరెరే! మీసం మెలేసినంతసేపుకూడా పట్టలేదే? ఓడిపోవటానికి?" అన్నా. "ఎల్లాగైనా ఆడపిల్లవికదూ?" అన్నాడతను. ఫక్కున నవ్వుకున్నాం. ఇది విని మాఅమ్మ ఏదో పనున్నట్టు నన్నుపిలిచి, యీకబుర్లూఆకబుర్లూ చెప్పి, నామనస్సుకు నెప్పికలగకుండా వుండేసమయం చూసి నవ్వుతూ "చూశావా? పిన్నిగా రేమంటున్నారో మీ నవ్వులు విని?" అంది.

మొన్నా డతనెంతో సరదాపడి సినిమా కెళ్లుదామని ఒచ్చాడు. నేను కనిపించకుండా గదిలో పడుకున్నా. "ఏం అలా వున్నావేం?" అన్నాడు దగ్గిరకొచ్చి. నేను మెదలకుండా అలాగే పడుకుని ఉన్నా. ఆదుర్దాగా మా అమ్మదగ్గిర కెళ్లి "అమ్మాయి అలా వుందేం?" అన్నాడు. "ఇందాకటి వరకూ కులాసాగానే వుందే!" అనుకుంటూ తడబడుతూ నాదగ్గిరకొచ్చి నెన్నుమీద చెయ్యేసి చూసి "ఏం అమ్మా? తలనెప్పా?...గుండెల్లో బరువా?" అని ప్రశ్నించింది ఆప్యాయంగా. అప్పుడప్పుడు అకస్మాత్తుగా తలనెప్పి, గుండెల్లో బరువూ ఒస్తుండేది నాకు. "ఊఁహూఁ..." అన్నా క్లుప్తంగా.

"పోతే మరి మాట్లాడవేం నాతో?" అన్నా డతను. నేనేమీ జవాబు చెప్పలేదు.

"ఏమిటి మరీ? చూస్తూ, యిటు తిరుగు" అంది మా అమ్మ భుజం పట్టుకుని. నేను లేచి కూర్చున్నా అమ్మకేసే చూస్తూ. అతను చిన్నబుచ్చుకుని "సినిమాకి రావూ? ఇవాళ ఆఖరురోజుటకూడాను?" అన్నాడు జాలిగా. ఇంతవరకూ జవాబు చెప్పకపోయినందుకే కుమిలిపోతున్న నేను పట్టుబలవంతాన ఎలాగో యీ మాటుకూడా మౌనంగా వుండగలిగా.

"ఏమిటా మొరటుతనం? పోనీ, వెళ్లరాదూ సినిమాకి?" అంది మా అమ్మ.

అతను నిరాశతో దీనంగా చూస్తూ "పోనీ, నా వేపు చూడన్నా చూడరాదూ?" అన్నాడు. నా హృదయం ఒకులై పోయింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. అతనికేసి చూసి మా అమ్మవేపు తిరిగా. ఆవిడ కర్థమైంది "ఛీ పిచ్చిదానా! ఏదో నవ్వులి కన్నా... సరదాగా వెళ్లిరండమ్మా" అంది. అతను గుచ్చిగుచ్చి అడిగాడు "విషయం ఏమి"టని.

"ఆఁ ... నిన్న కోప్పడ్డా దాన్ని...అదీ..." అంది మాఅమ్మ.

"పోతే, మరి నామీ దెందుకూ కోపం?" అన్నా డతను.

"దాని మొహం!" అని తప్పించేసిం దసలు సంగతి చెప్పకుండాను. ఎంత పూసేసినా నన్ను బాధిస్తూనేవుంది కిందటిరోజు విషయం.

"మనం నవ్వుకుంటుంటే పిన్నిగా రేమిటో అన్నారుట. కనక నేను సినిమాకి రావడంగాని, ఆడుకోటంగాని..." అర్థోక్తిలోనే అత నందుకుని "పోనీ నవ్వకుండానే వెడదాంలే. లే..." అన్నాడు నవ్వుల్లోకి దిగేసి. నేను రానంటే రానన్నా. ఎంతో

బలవంతం చేసినమీదట ఎప్పుడూ సినిమాకి వెళ్లని మా అమ్మకూడా బయల్దేరటంచేత గంటఆలస్యంగా వెళ్లాం ఆరోజు సినిమాకి. తరవాత అలాంటి సంఘట నేమీ జరగకపోయినా నామనస్సులో మటుకు కలుక్కు మంటూనేవుంది. అసలు మా అమ్మ అలా ఎందుకనాలి? అదీగాక, యిరుగుపొరుగువాళ్లు మా యిద్దరికేసీ చూసి చేసే చేష్టలవల్ల క్రమంగా అర్థమయింది. వయస్సు వచ్చిన నేను యవ్వనంలో వున్న అతనితో మనిషీ మనిషీ ప్రవర్తించినట్లు ఉండటం వాళ్ల దృష్టిలో బాగుండలేదు. నిన్న మొన్నటిదాకా ఎంతో యిదిగా ఉన్నాం. కాని యిప్పుడుమాత్రం వీల్లేదు. కారణం యవ్వనం. దానికి నే నేం బాధ్యత వహించగలను? యవ్వనం ఒస్తే హృదయం చంపుకోవాలని వీళ్ల ఉద్దేశం. కసాయిపనిచెయ్యటం నాకు చేతకాదు!

౨

నా పెళ్లికి పెత్తనమంతా అతనిదే. ఎంతోసరదాగా ఉన్నాడు నవ్వుతూ నవ్విస్తూ. నిజానికి నాకేమీ ఎబ్బెట్టనిపించలేదు. ఒకేచోట చదువుకోటం చేత మేంముగ్గురం ఎంతో స్నేహంగా వుండేవాళ్లం. టెన్నిస్ ఆడుకున్న తరవాత నేనూ అతనూ కలిసి ఆ అమ్మాయియింటికి రావటం, ముగ్గురం షికారువెళ్లటం సాధారణంగా మరుపుకు రావు. నాచదువుకోసం ఆ పట్నంవిడిచి నేను వెళ్లిపోయినా, అతనికీ ఆ అమ్మాయికీ స్నేహంనిరంతరాయంగానేవుండిపోయింది. నాకూ అతనికీ ఏంరా అంటే ఏంరా అనుకునేంత స్నేహం. అతని కిదివరకే పెళ్లికావటం, నాకూ ఆ అమ్మాయికీ ఎక్కడో దూరపుబంధుత్వం ఉండటం — ఏమిటో తమాషాగా భార్య అయిపోయిందాఅమ్మాయి నాకు. దాని క్కరణంమటుకు నేను చెప్పలేనుగాని, యిప్పుడతను ఆ అమ్మాయికేసి—కాదు, నాభార్యకేసి—చూస్తే నాకు అసహ్యమైన బాధ పుట్టుతుంది. దానిసౌందర్యం, యవ్వనం అంతా తాగేస్తున్నాడనిపిస్తుంది ... అవును, యిప్పుడాఅమ్మాయి నాభార్య. దానిమీద నాకు సర్వాధికారాలూ వున్నాయి. నాకిష్టం లేందే అది యింకోళ్లని పలకరించకూడదు. వాళ్లు పలకరించినా జవాబు చెప్పరాదు. కన్నెత్తి చూడరాదుకూడాను. అదీగాక, ఎవరూకూడా దానితో మాట్లాడరాదు. దాన్ని చూడరాదు కూడాను. అవునూ, నాకిష్టంలేదూ! ఎంత స్నేహం అవుతేమటుకు ఏమి టాపోకడ? లోకం ఏమనుకుంటుంది?—ఊఁ. ఏమిటో వెఱ్ఱిగానీ! వెధవ లోకం ఏం అనుకుంటేనేం? పెళ్లి రేపనేవరకూనూ, పెళ్లిలోనూకూడాముగ్గురం అంతచనువుగానూ, స్నేహంగానూ ఉంటున్నవాళ్లం, అకస్మాత్తుగా, ఏమీకారణం లేకుండా, మొన్నటినుంచీ అత నాస్నేహబంధం నరికేసుకోవాలని నేను కోరటం మూర్ఖత కాదూ! చదువుకున్నవాళ్లకూడా యిలాంటి పిచ్చిపిచ్చి, తలాతోకాలేని ఊహలు పుడుతాయేం?.... ఏమిటో !!

ఆనాడు కోర్టునుంచి నేను ఒస్తుంటే దార్లోనే ఎదురుపడ్డా డతను ఆసుపత్రి మూసేసి. ఇద్దరం మా యింటి కొచ్చాం. సముద్రంఒడ్డునవున్న హాల్లోకి ఆరుగంటలనాటకాని కెళ్లుదామని దార్లోనే నిశ్చయించుకున్నాం. ఇంటికి రాగానే మా ఆవిడకూడా ముస్తాబై "ఇవాళ మీరుకూడా దబ్బున ఒచ్చారే?" అంది అతనితో.

"మరే! ఆపరేషనుకేసు యివాళింకా ఏదీ రాలేదు. అందుకని ..." అన్నా డతను.

"ఒదినగారితో చెప్పాయిందాకే. తయారుగానే వుంటుంది బహుశా." అంది మళ్లా.

"ఆఁ, అదో పల్లెటూరి రకం . . . నువ్వు వస్తున్నావుగా? తయారుచేద్దువుగానిలే . . . ." అన్నాడు నవ్వుతూ.

"మహాబస్తీరకం అయ్యాం లేస్తురూ? మనం!" అందిజవాబుగా. ఇద్దరూ పకపకానవ్వుకున్నారు. నేను సహించలేకపోయా. మొహంమీదే "ఏమి టావెర్రినవ్వులు" అని అందామనుకున్నాగాని మర్యాదగా వుండదని ఊరుకున్నా. వాళ్లల్లో నానవ్వుకలపకపోవటమే నా అసమ్మతిని తెలియజేయటానికి సక్రమమైన విధానమని ముభావంగా కూర్చున్నా. నాఉద్దేశం గ్రహించారో లేదో! కాస్సేపాగి, "టైం అవుతోంది మరి బయల్దేరండి . . . అక్కడకూడా కొంతఆలస్యం

అవచ్చు..." అంది మాఆవిడే. నేను రాననే చెప్పదామనుకున్నా. కాని కారణ మేముందీ రాకపోవటానికి?

"అల్లా వున్నావేంరా?" అన్నా డతను.

"ప్చ్... ఏంలేదు...ఎలా వున్నా?..." అన్నా నేను. ముగ్గురం అతనింటి కెళ్లాం. అతనిభార్య తయారుగానే వుంది. "చూశావుట్రోయి, మీ ఆవిడకంటె కూడా వెయ్యిరెట్లు దర్జాగా తయారైంది. అయ్...డబ్బా!!" అన్నా డతను. నేను కొద్దిగా అరువు తెచ్చుకున్న నవ్వు నవ్వాను. ఇందాక మా ఆవిడని అతను మెచ్చుకున్నా నాకు బాధే కలిగింది; ఇప్పుడు తనభార్య వెయ్యిరెట్లు దర్జాగావుందన్నా నాకు బాధే కలిగింది. ఈసంఘంలోని జీవిని నేను. నిజానికి పరిస్థితులచేత తయారు చేయబడ్డా నేను. పరిస్థితుల్ని తయారుచేసుకునే శక్తి నాకు లేదు. నాకే కాదు ఎవరికీకూడా ఉండదనే నా ఉద్దేశం.

"టిక్కట్లు రిజర్వుచేయించద్దూ మరి?" అంది మా ఆవిడ. నేను జవాబు చెప్పకముందే "ఫర్వాలేదు లేద్దూ!" అన్నా డతను.

"డాక్టరుగారుగదాఅనా?" అంది మాఆవిడ.

"ఉఁహూ, ప్లీడరుగారుకూడా ఒస్తున్నారు కదూ? అందుకని..." అంది అతనిభార్య. మళ్లా పకపకా నవ్వుకుంటూ కారెక్కబోతున్నారు. నేను భరించలేకపోతున్నా. మౌనంగా అలాగే కుర్చీలో కూర్చున్నా.

"ఏంరా, యిందాకటినించీ అలాగే వున్నావు! ఒంట్లో బాగుండలేదా?" అన్నా డతను కొంచెం ఆదుర్దాగా.

"ఉఁ, అదే! కాస్త తలనెప్పిగా వుంటేను..." అన్నా మొహం ఆదోలా పెట్టి. అతను నదురుపట్టుకు చూసి, గబగబా లోపలికెళ్లి ఔన్సుగ్లాసులో మందు తీసుకొచ్చాడు. నాకది మందుకాదు. అయినా తాగేశాను.

"ఇందాకటివరకూ కులాసాగానే వున్నారే?" అంది అతనిభార్య.

"ఇవాళ నూనెతిరగమోతకూడా కాదే?" అంది మాఆవిడ.

అంతా మళ్లీ మాయింటికిరాబోతుంటే "పోనీ, మీరు ముగ్గురూ వెళ్లరాదూ? ఓగంటలో తగ్గిపోదూ తలనెప్పి?" అన్నా.

"ఛీ! సరదాగా బయల్దేరాం. వెళ్లితే అంతా వెళ్లాలిగాని ఏంమునిగిపోయింది? నేం వెళ్లమంటే మేంవెళ్ల"మన్నారు ముగ్గురూను.

## 3

డాక్టరూ, భార్యా అటువెళ్లగానే ఆయన నడిమంచంమీద లేచి కూర్చుని ఎప్పుడూలేని కుచ్చితపు చూపులు చూస్తూ, ఎడంవేపుమీసాల్ని ముని పళ్లతో కొరుకుతూ మూతిబిగించే"పోయింది...నెప్పి" అన్నారు. నా కాట్టే ఏమీ అర్థంకాలేదు. ఇమిషం కిందటివరకూ అంత వ్యాకులంగా ఉన్నాయనల్లా తమాషాగా లేచి కూర్చుని యిలా మాట్లాడటం ఆశ్చర్యంవేసింది. నేను తికమకపడుతున్నట్లు గ్రహించి విషపూరితంగా కాస్త నవ్వుతూ, "తెలీదూ? తలనెప్పెందుకో?" అని ప్రశ్నించారు. నేను జవాబు చెప్పేలోపుగానే కనుబొమలు ముడుచుకుని "వెళ్లకపోయావ్? వెడుతారనే అనుకున్నా అసలు!"అన్నారు ఆయనే. "వెధవ...స్నేహితుడవుతేమాత్రం?"... తడబడ్డారుకాస్త. కోపం పైకే కనిపించింది. నామౌనం యింకా రగిల్చిందో ఏమో, కళ్లెర్రజేసి "ఏం అలా చూస్తావేం?" అంటూ దూకుడుగా మంచంమీది నుంచి లేచి యిటూ అటూ పచారుచెయ్యటం మొదలెట్టారు."ఈమాటు రానీ...మొహం వాచేట్లు చివాట్లు పెట్టేస్తాను." అనుకున్నారు మళ్లీని, చేత్తో క్రాపు ఎగదువ్వుకుంటూను.

అప్పుడప్పుడు డాక్టరు సరదాగా మాట్లాడుతుంటే, ఆయన మొహం చిట్లించుకున్నట్లు కనబడటం నేనూ గ్రహించకపోలేదు. మాఅమ్మ చెప్పినదానికీ

యీ చిట్లింపులకూ సంబంధం ఉండకపోదనీ అనుకునే వున్నా. చెప్పద్దూ, యీ అసహనం యింత తీవ్రమైన పరిణామం పొందుతుం దనిమాత్రం ఊహించలేదు. ఆయనమనోభావాలకు అనుగుణంగా పోవటానికిగాను నా హృదయంలోవుండే నిర్మలోత్సాహాన్ని పూడ్చి పెయ్యటానికి నేనూ ప్రయత్నించలే దింతవరకూను. చివాట్లూ, చెప్పుదెబ్బలవరకూ ఒచ్చేసరికి నాకూ కోపం ఒచ్చింది. నా అసమ్మతిని తెలియజెయ్యటానికి కుర్చీలోంచి లేచి సావిట్లో కెళ్లబోతుంటే ఆపి "ఆడదానివి నీకన్నా వుండొద్దూ సిగ్గు?" అన్నారు. జవాబు చెప్పకుండా వెళ్లిపోయే పరిస్థితి తప్పిపోయింది. ఆడదాన్ని నాకన్నా ఉండాలిటసిగ్గు! మొగాళ్లకక్కర్లేదనా ఆయనఉద్దేశం! నిజానికి సిగ్గులేని పని నేనేంచేశాను ?

"నేను సిగ్గులేని పనేమీ చెయ్యలేదు." అన్నా రోషం ఆపుకోలేక.

"అతనో?" అన్నారు గదమాయింపుగా.

"అతనూను."అన్నా జవాబుగా.

"ఇహ నే ననేగా నీ ఉద్దేశం?" అంటూ నా సమాధానానికి ఆగే మర్యాదన్నా పాటించకుండామీది మీదకొచ్చి "ఎదిరింపుకూడానా? ఆ కికకికలూ పకపకలూ!...పైగా నాకా సిగ్గులేంది? సంసారిలక్షణాలేనా యివి? ఉఁ..." అంటూ ఉగ్రరూపం దాల్చి ఎడంచెంపమీద ఫెడేలున ఒక్కదెబ్బ వేశారు. శరీరం మీద దెబ్బపడేదాకా అలాంటి దౌర్జన్యం జరుగుతుందని కొంచెంకూడా అనుకోలేదు. బురబురా పొంగింది. కాదంటే అవుననీ, అవునంటే కాదనీ, మీదే తప్పనీ, పొరపాటనీ లక్షసార్లు పోట్లాడుకునేవాళ్లం అనేక విషయాలమీద. ఎంతో సరసంగా నడిచిపోయేది. కాని భర్తృత్వంయొక్క కాఠిన్యం యివాళ ప్రదర్శితమైంది. నేను భరించలేకపోయా. ఒళ్లంతా జలదరించింది. ఎంత ప్రయత్నించినా కళ్లల్లో గిర్రున తిరిగిన నీళ్లని కిందపడకుండా ఆపటం నా వశం కాలేదు. ప్రథమాన భంగం అవటంచేతనో ఏమో ఆయనా నామొహం చూడలేక, మొహం తప్పించటానికిగాను, బూట్సులు తొడుక్కొని చరచరా వీథిలో కెళ్లిపోయారు. వాలకంచూస్తే బాగా పశ్చాత్తాపపడుతున్నట్లు కనిపించింది. కాని అహంకారం హృదయాన్ని ముంచేసుండాలి. ఆయన నావేపు చూడనన్నా చూడలేదు.

౪

రాత్రి ఎప్పుడో,౧౦౼౧౧ గంటల కింటికి చేరాను. ౨౦ లంకణాలుచేసిన మనిషల్లే కనిపించింది. నాకు చాలా జాలేసింది. నేను తొందరపడ్డానని నాకు తెలుసు. ఇంట్లో అడుగుపెట్టేటప్పుడు క్షమాపణ కోరుకుందా మనకున్నాకూడా. గోడవేపుకి మొహం తిప్పుకుని పడుకునుండటంచేత నారాకని తెలియజెయ్యటానికిగాను కొంచెంగా దగ్గు తెప్పించుకున్నా. వెనక్కి చూసి గిరుక్కున తల తిప్పేసింది. దాంతోటి నాలో చిగురిస్తున్న మానవత్వం కాస్తా ములములా మాడిపోయింది. అవునూ, దానిప్రవర్తన నాకేమీ బాగుండలేదు. నాఅసహనాన్ని దానికి తెలియజేశాను. పద్ధతిలో కొంచెం తీవ్రత వుండొచ్చుగాక, — ఉందే అనుకోండి! అంతమాత్రంచేత నన్నావిధంగా తిరస్కారభావంతో చూడటానికి దానికి హక్కుందీ? స్పష్టంగా తెలుసు నాకు—లేదని. లేనిహక్కు చలాయించటం నేను సహించను.

"ఏమండీ! కోపం పోయిందా?" అంటే నా మన స్సెంత నీరైపోయేది? అందాకా ఎందుకు? ఆ సమయంలో నేను రాగానే దీనంగా ఒక్కచూపు చూస్తే చాలదూ? కాళ్లమీద పడి క్షమాపణ వేడుకోనూ? అదేమీ లేకుండా అంతతృణీకారభావమేం? నేనూ క్షణమన్నా ఆగకుండా సావిట్లో కెళ్లిపోయా. తెల్లారింది—నాకు సావిట్లోనూ, దాని కాగదిలోనూను.

మసిమసిచీకట్లోనే అత నొచ్చాడు "ఎలా ఉందిరా?" అంటూ. నే నేమీ జవాబు చెప్పకూడ దనుకున్నా. "ఏం? పోయినట్టే వుందే మొహం చూస్తే?" అంటూ మొహమ్మొదచెయ్యేశాడు. అప్రయత్నంగానే "ఁఆ, తగ్గిపోయింది. పొద్దున్నే ఒచ్చావే?..." అని సోఫాలో కూర్చోపెట్టి, "కాఫీ తయారుచేయించవే! అతనుకూడా ఒచ్చాడు" అని కేకేశా. అతను కూర్చోకుండానే "ఆఁ, ఫరవాలేదులే. అర్జంటుకేసు. న్యూమో

నియాట. తెల్లారుఝామునే ఒచ్చారు పాపం—మళ్లీ ఒస్తా"నంటూ, "అమ్మాయి!" అని కేకేసి, "లోపలుందేమోలే!" అనుకుని "ఇంకో మోతాదు పంపిస్తా కుర్రాడిచేత" అని నాతో చెప్పి గుమ్మం దిగేశాడు. "అదేమిటీ, కాఫీ అన్నా తాగకుండానూ?" అంటూ అనకుండానే అతనితో వీధిలో నాలుగడుగులు నడిచి 'ఉంటా' నని వెనక్కి తిరిగి మనస్సులో నా బలహీనతకి నన్ను నేనే నిందించుకుంటూ లోపలికొచ్చి గదిగుమ్మంలోంచి తొంగిచూస్తే అది యింకా పడుకునేవుంది.

తొమ్మిదింటికి నేను ఆఫీసుగదిలో కాగితాలు చూసుకుంటూంటే పనిమనిషి నాముందరనుంచి నాకేసే చూస్తూ రెండుమూడుమాట్లు యిటూఅటూ తిరిగింది. నాతో ఏమన్నా చెప్పాలంటే అలా చెయ్యటం మామూలు. "ఏం?" అన్నా.

"...౧౦౧ ఉందిటండి. యింకా లేవలేదు అమ్మగారు..."అందిభయపడుతూ. నేను ఉలిక్కిపడి కలం చేత్తో పట్టుకునే దానిదగ్గిరికెళ్లి ఒళ్లుపట్టుకుచూస్తే కాలిపోతోంది. కొంచెం కలవరపడుతూ "జ్వరమల్లే వుందే!" అన్నా.

"ఊఁ" అంది జాలిగా. జ్వరం ఎందుకురావాలి? "డాక్టర్ని పిలుచుకొస్తా" నంటూ లేచా.

"అతన్నేనా?" అంది అదోరకం ఊపుతో.

"అతన్నేనా?" అని ఆశ్చర్యపడుతుందేం? అంటే అతన్ని పిలుచుకు రారాదనా? లేకపోతే అతన్నే పిలుచుకురావాలనా? అవునూ, ఆ వెకవెకలూ, పకపకలూ నా కిష్టం కాలేదు. నా అయిష్టతని సూచించటానికి కొంచెం తొందరగా ప్రవర్తించినమాట వాస్తవమే. సరే జ్వరం ఒచ్చింది. మొదట్లో అతన్నే పిలుద్దామనుకున్నా. నిజానికతను మాయింట్లో డెబ్భైఆరు జబ్బులు నయంచేశాడు. కాని యిప్పుడతన్ని పిలవటం అసంభవం. నాకు చేతకాదు. అతనింటి ముందర్నుంచే వెళ్లి యింకోడాక్టర్ని పిలుచుకొచ్చా. కొత్తడాక్టర్ని చూసి అది నామొహంలోకి అర్థయుక్తంగా దృష్టుల్ని సారించింది. "అంతే!" అన్నట్టుగా నేను గంభీర మౌనంతో వాటికి జవాబు చెప్పా.

ఏదోమందిచ్చి బండీఎక్కి వెళ్లబోతూ "౧౦౩ దాటింది. ఉడుకులాం వెయ్యండి వెంటనే. మంచుగడ్డ పెట్టినా పెట్టచ్చు" అని నాతో చెప్పి అటు తిరిగే సరికి, కేసులు చూసుకుని అప్పుడే మాయింటికి రావటానికే ఎదురొస్తూన్న అతని "ఏమిటి? ఎవరికి జబ్బు?" అని ప్రశ్నిస్తున్న చూపులకు కొత్తడాక్టరే "ఆయనభార్యకు ౧౦౩ దాటింది...ఇప్పుడే ... చూడమంటేనూ" అని తడబడుతూ జవాబు చెప్పటం, ఉలిక్కిపడి అతను లక్షభావాల్తో గజిబిజిగా ఉన్న చూపుల్ని నాకేసి తిప్పటం, వాటికి తాళలేక నేను మొహం తిప్పేసి యింట్లోకి పోవటం ఒక్కమాటే జరిగాయి. కొత్త డాక్టరుబండీ చక్రాల రొదలో అతని హృదయస్పందనం నాకుగాని, నాదీర్ఘశ్వాసలు అతనికిగాని అవగతం కాలేదు.

మొన్నాడు ౧౦౮ ఒచ్చింది. నాకు గాభరాపుట్టి మా అత్తగారికి టెలిగ్రాం యిచ్చా. ఆవిడ తనపెత్తల్లి కొడుకుదగ్గిరికెళ్లి వారంరోజులకూడా కాలేదు. ఒచ్చి "కొత్తడాక్టర్ని పెట్టారా? నేను వెళ్లేసరికి బాగానే తిరుగుతోందే? ఇంతలోకే ఎలా ముంచుకొచ్చిందబ్బా!" అంది. నేను సమాధానం చెప్పలేక దానికేసి చూశా. అది నా మొహంలోకి చూసి తనతల్లి వేపు తలతిప్పింది. ఆవిడా మాట్లాడలేకపోయింది. తరవాత, సంగతంతా తెలుసుకుని మరీ వేదనపడటం మొదలెట్టింది...ఆరోజు కారోజు జ్వరం హెచ్చిపోతోంది. జ్వరబలంమూలాన నీరసం బాగా కనిపించకపోయినా, బొత్తిగా ధారకం లేకపోవటంచేత శరీరం శుష్కించిపోవటం మొదలెట్టింది. అతన్నితప్ప ఊళ్లోవున్న పెద్దపెద్దడాక్టర్లనందర్నీ పిలిచా. న్యుమోనియాఅనీ,టైఫాయిడనీ, యిన్ఫ్లుయంజాఅనీ, మలేరియాఅనీ తలోరకంగా చెప్పారు. నాకు తత్తరపాటెక్కువైంది. అతనతప్ప ఇంకోళ్లెవరూ నయంచెయ్యలేరని మాఅత్తగారి దృఢవిశ్వాసం. ఆసంగతి నాకూ తెలుసు... ఏంరా అంటే ఏంరా అనుకునేవాళ్లకల్లా ఎడమొహాలూ పెడమొహాలూ అయ్యాయి. దురదృష్టం తరుము

కోస్తోంది. రెండుమూడుసార్లెదురుపడితే నేనే మొహం తప్పించేశా. మానవసహజమైన గౌరవాన్నికూడా త్యజించి ఓరోజు రోడ్డుమీద ఎదురుపడి "ఎలావుంది?" అని అడిగాడు. జవాబు చెప్పక పోదామనుకుంటూనే "అలాగే వుంది" అని మాత్రం అంటూ దులపరించుకుని చరచరా వెళ్లిపోయా. అతని భార్యమాత్రం రోజూ ఒచ్చిచూసిపోతూనేవుంది.

మనస్పృహలేకుండానే రోజులో చాలా గంటలు గడుస్తున్నాయి. పైగా ఆరోజు సాయంత్రం వేళ మంచంమీదే, కొంచెం లేవాలనుందంటే లేవతియ్యబోయేసరికి గాభరాఒచ్చి పడిపోయింది. కాళ్లూ చేతులూ విరగదొక్కుకుంటూ గాభరా తగ్గినతర్వాత "ఎలా వుంది?" అని అడిగితే, నాకేసి దీనంగా చూసి కన్నీళ్లు కార్చింది. నాగుండెలు తరుక్కుపోయాయి. వెనకటి దృశ్యాలు ఒక్కొక్కటిగా నాకళ్లముందర్నుంచి పరిగెత్తుకొనిపోతూ నామనస్సుని కోసెయ్యటం మొదలెట్టాయి. ఈవ్యాధికి కారణం నేనని నాకు మొదటి నుంచీ తెలుసు. చికిత్సకూడా నాకు తెలీందికాదు. తెలిసికూడా, మగతనం, అంగుళానా భర్తృత్వాన్ని అహంకారంతో మిళితంచేసి నిర్మలమైన యీజీవిని హతమారుస్తున్నా.

జలజలా కన్నీరుకారుస్తూ "క్షమించవూ?" అన్నా. ఈమాట ఆరాత్రే అంటే! అప్పుడు నేను చచ్చిపోయా!!

"అతన్ని పిలుచుకు రారాదూ" అంది మా అత్తగారు. నేను లేచా. అంతకి మూడురోజుల్నించి కేవలం సంజ్ఞలే తప్ప పెదిమెలు కదిలించటానికి శక్తిలేని మనిషల్లా "అత... నేనా?" అంది. అని తల్లికేసీ, నాకేసీ ఒక్కమాటుగా చూసి తల వాల్చేసింది. అంతే, మళ్లీ తలెత్తలేదు. మా అత్తగారు బావురుమంది. నేను పిచ్చివాడిమాదిరిగా పరిగెత్తుకు పోయా. అతనూ అప్పుడే గాభరా సంగతి వినిమాయింటికి ప్రయాణమౌతున్నాడు. చూపుల్తోనే ఒకళ్ల హృదయాలొకళ్లు గుర్తించుకున్నాం. "నేను రాక్షసిని..." అన్నా ఏడుపు ఆపుకుంటానికి ప్రయత్నంచేస్తూ. "నేను పిశాచాన్ని" అన్నాడతను కన్నీరు కారుస్తూ... రెండంగల్లో గదిలోకొచ్చి "అమ్మాయీ!" అన్నాడతను. కంఠధ్వని గుర్తించింది. మొహంలోమటుకు మందహాసం కనిపించింది. కళ్లుతెరవటానికి ప్రయత్నమన్నా చెయ్యకుండానే మహాకష్టమ్మీద "వెళ్లిపోతున్నా. శలవు" అనే అర్థం ఒచ్చేట్టుగా చెయ్యి ఎత్తి వాల్చేసింది శాశ్వతంగా.

